# లోకందృష్టి

ఆరుమల్లి విశ్వనాథరావు

*

త్రనెంత చేదయిపోయిందీ లోకానికి! ఎంత నిర్దాక్షిణ్యత పహించిందీ తనపయిన? యీలోనికి తను చేసిన అపరాధాలు యేమున్నై? తనీ మానవ లోకంలో, యీ స్వార్థ సమాజంలో ఆడదై జన్మించటమే గొప్ప అపరాధం. బాజాభజంత్రీలు, మంత్రాల బ్రాహ్మలూ ఒక వ్యక్తి తన ఖంఠానికి... యేమోముడివేయటం...ఇటువంటి తంతులతోకూడిన పెళ్ళి అనేదిలేకుండా తమ సంతానాన్ని కనటమే లోకందృష్టిలో యెవరూచెయ్యని గొప్ప అపరాధం.

నిజంగా తను అంత అపరాధంచేసిందా? తనకు తెలుసు తనుచేసింది అపరాధం అవునోకాదో. తనకుతానై తన చిన్ని హృదయంతో తన ప్రవర్తనను విమర్శించుకుంది. అది తనకు తప్పుగా తోచలేదు. తన నిర్ణయాన్ని తన అంతరాత్మ బలపరుస్తోంది. అలాంటప్పుడు తనీ లోకాన్నిచూసి భయపడాల్సిన ఆవుసరంయేముంది?

అతన్ని నమ్మింది, హృదయమిచ్చి ప్రేమించింది, అతనిప్రేమను అందుకుంది. ఆ ప్రేమకు ఫలితమే...మూడురోజుల్నుంచి గుప్పెడు మెతుకుల్లేక, త్రాగటానికి కసిన్ని గంజినీళ్ళయినాలేక గొంతుక ఎండిపోయి, నీరసించిపోయి, బొమికలు బయటికి కనుపిస్తూ మంచాని కంటుకుపోయిన తన అయిదేళ్ళ గోపి, పాలకోసం ఆగిఆగి కేరమంటున్న పశిపిల్ల రాధ. రెండుప్రాణాల్ని తనుభరించమని, తన్నొక అంధకారంలోవిడిచి, అతనీలోకాన్నించి విరమించాడు.

ఇప్పుడు తను నిరాధార. నా అన్నవాళ్ళూ ఆమె పయినించి వీచే గాలినికూడ నిషేధించారు. ఏ విధంగానూ వాళ్లని పోషించలేని అసమర్థ. ఏ పని చేసి అయినాసరే వాళ్ళని పోషించటానికి శిద్ధమే. కాని, తనని నీచంగానూ, హేయంగానూ చూసే లోకం తనకెచ్చటా ప్రవేశమివ్వదు. నిందిస్తుంది... హేళన చేస్తుంది...విషపూరితమైన నవ్వులు నవ్వుతుంది...ఉమియజూస్తుంది. ఇదంతా తను ఊహించలేని తన నేరానికి ఫలితమేనా?

లజ్జా, అభిమానంవిడిచి యాచనకుశిద్ధమై, దేహీఅని చెయ్యిచాచినా, యీ పెంకుటి భవనాలు, యీ గొప్పగొప్ప మేడలు, మిద్దెలు తన దీనస్థితికి గుప్పెడుగింజల త్యాగానికయినా సాహసించవ్.

ఆకలితో అల్లాడిపొయ్యే యీ ప్రాణాల్ని తను యెలా ఊరటబెడుతుంది? యెలా పోషిస్తుంది? వాళ్ళని సాకటానికి యేదిమార్గం? యేది తరుణోపాయం?

లేదు...లేదు. యే విధమయిన అవకాశం తనకిలేదు. తను ఊహించగలిగినంతవరకూ యేమీ స్ఫురించదు. తనకై కైవ్రేలాడే రెండు జీవులే లేనట్టయితే తనుకూడ యీ పాడుప్రపంచానికి స్వస్తి చెప్పిఉండేదే.

ఉపయోగరహితమయిన తలంపులకు భంగంగా..."అమ్మా!" అన్నాడు నీరసించిన గొంతుతో గోపి. చమురులేక దిగిపోతున్న దీవపువత్తినియెత్తి తనకి తెలీకండా కారుతూన్న కన్నీటి జలాన్నిపైట చెంగుతో వత్తుకుని, గోపి చెంపల్ని స్పర్శిస్తూ, మొహంలో మొహంపెట్టి సహజ వాత్సల్యంతో గాద్గధికంగా..."యేంకావాల్నాన్నా?" "అమ్మా...అమ్మా...దాహంవేస్తోందే..." ఆమె హృదయం తరుక్కుపోయింది. ఆఖరుకు తనపట్టి యెండిపోయిన గొంతుకు తడిసేందుకు కసిన్ని వేణ్ణీలయినా సమకూర్చలేనిస్థితి. అయ్యో! తన నిస్సహాయత ఎంత మితిమీరింది. ఈ క్షణాన తన పరిస్థితులు తనకే జీవం

లేనివ్వను కల్గిస్తున్నై. ఆమె కళ్ళనుండి రెండు వేడి కన్నీటిచుక్కలు గోపి చెంపలపయిపడినై. ఎందుకో తనవంక చూస్తున్నాడు. యెంత బాధ పడుతున్నాడో తనకాచూపుల్లో స్ఫురిస్తోంది.

ప్రక్కనేవున్న మట్టికుండలోని చన్నీళ్ళు దాహమంటున్న ఆ నోటిని నింపింది. అంతకంటె తనుచేసేదేముంది? చెయ్యగలిగిందిమాత్రం యేముంది? దీపం ఒక్కసారి ఆరిపోయింది. అంధకారంలో తను ప్రాకులాడుతోంది. ఆ పూరింటి వెలుగుల్లోంచి ఒకటిరెండు నక్షత్రాలుమాత్రం తన దీనస్థితికి సానుభూతిచూపుతున్నవా అన్నట్టు మినుకుమినుకుమంటూ తొంగిచూస్తున్నై. "అమ్మా!" అన్నాడు గోపి ఒక్కసారిగా యెక్కడికో వెళ్ళిపోతున్నట్టున్న స్వరంతో. "నాన్నా!" ఆ చీకట్లో గోపి శరీరాన్ని తడుముతూ..."నాన్నా! గోపీ!" మాట్లాడడు. కదలడు, మెదలడు. మళ్ళా వణుకుతూ భయాన్ని స్ఫురింపచేస్తూన్న గొంతుతో..."బాబాయ్! నాయనా! మాట్లాడవ్...ఆకలా? దాహం వేస్తోందా? చెప్పునాన్నా?" లేదు...సమాధానంలేదు...ఆ శరీరంలో చలనమే లేదు...మంచుకంటె చల్లనై పొయ్యిందా వొళ్ళు. ఆమె హృదయతంత్రులన్నీ ఒక్కసారి తెగిపోయాయి. ఎక్కడెక్కడో దాగుకొనివున్న ఆమె దుఃఖమంతా ఒక్కసారి విజృంభించి పొంగిపొర్లింది. ఉబికివస్తున్న దుఃఖంతో... "నాన్నా! గోపీ, నాతో మాట్లాడవూ? నా వంక చూడవూ? యేదీ నీ చిన్నినోటితో ముద్దుగా అమ్మా అను. ఇంకెక్కడి అమ్మ! నీ ఆకలితీర్చలేని యీ నిర్భాగ్య అమ్మపయిన కోపగించావా? నీవు కూడని అమ్మను నిషేధించావా? నీ అమ్మను..." గొంతు



తడారి పోయ్యింది. మాట్లాడేశక్తి నశించింది. కళ్ళ వెంట కన్నీళ్ళచుక్కలు రాలటం కట్టుబడ్డాయి. శరీరం ఆపాదమస్తకం గజగజ వణుకుతోంది. తను తన పూరిల్లు ఆనిశలో లీనమై ఎక్కడికో తేలిపోతున్నట్టు అవుపించింది. ఛీ! యెంతక్రూరత వహించింది దైవం. పసిపిల్లరాధ కేరుమంది. "అమ్మా!" అంటూ రాధ శరీరాన్ని నిమిరింది. ఆకలికి తాళలేక కాబోలు యేడుస్తోంది రాధ. తనహస్తాల్లోనికి తీసుకుంది రాధను. వక్షానికి అదుముకుంది. ఒక్కసారి తనలో తను గట్టిగా నవ్వుకుంది. బయటికివచ్చింది. అంతటా అంధకారం గుడ్లగూబలు భయంకరమైన అరుపులు, యేవో పురుగులు చేసేధ్వనులు, ఒక్కసారి యేడ్చింది... మరుక్షణం గట్టిగా నవ్వింది. నక్షత్రాలు తోడుగా ఆ అంధకారంలో పూరింటిని విడిచింది.

ఈశ్వర్స
రత్నపురుష లేహ్యాం
శుక్లనష్టము, మలబద్ధము, నరముల బలహీనత, నీరసము తగ్గించి బలము, కండపుష్టి, రక్తము, వీర్యవృద్ధి నిచ్చును.
గనోక్యోల్
అన్నిసెగలను అద్భుతముగ తగ్గించును. ఇతరౌషధములకు లోబడనికేసులలో సహితము యిది కుదుర్చును. మూత్రనాళమందలి మంట, రసివంటి చెడ్డనీరు స్రవించుట అద్భుతముగ తగ్గించును.
కుముద
స్త్రీల తెల్ల, ఎఱ్ఱకుసుమలు, అకాలబహిష్టు, బుతుశూల, వెన్నునొప్పి, గుండెనొప్పి, తగ్గించును. బుతురక్తమును జారీచేయును. గర్భపాతమును కాకుండచేయును.
అన్ని గొప్ప మందులషాపులయందును దొరకును.
ఈశ్వర ఫార్మసీ,
మద్రాసు.

యెక్కడికో? యెందుకో? ప్రకృతిని చీల్చుకుంటూ నడిచిపోతోంది. తన గమ్యస్థానం, తన కర్తవ్యం, తనకే తెలీవు. ఎంతదూరం నడిచిందీ, ఎన్నిగంటలు నడిచిందీ, తనలోని ఏ శక్తులు తనకి సహాయపడింది, ఆమెకక్కర్లేదు. ఆ వినీలాకాశంలో సూర్యుడు తన సహస్ర కిరణాల్తో ప్రతిఫలిస్తున్నాడు.

ఒకచోట నిల్చింది. అదో హంచక్కటి తీర్చి దిద్దిన భవనము. ధైర్యంగా ముందుగేటును త్రోసుకు లోనికి ప్రవేశించింది. మెట్లెక్కి హాలులోనికి వెళ్ళింది. నాలుగయిదు యీజీచైర్లు ఓ డ్రాయరు, గోడలన్నీ దేశనాయకుల పెద్దఫోటోలు ఉన్నాయి. ఆ డ్రాయిరు పయిన యేవేవో న్యూసుపేపర్లు తారాడుతూ వున్నాయి. నెమ్మదిగా తన పాపను, నిద్రావస్థలో ఉన్న తన రాధను, ఒక పడక్కుర్చీలో పరుండబెట్టి తనపాడి పెదవుల్తో ముద్దుపెట్టుకుంది. కంటినుంచి రాలిన రక్తపు బిందువు రాధ నుదుటి పయిన కుంకుమరేఖ దాల్చింది. వెనుతిరుగింది, మెట్టుదిగింది హృదయంలో రాధరూపం మెరుపులా మెరిసింది. మళ్లా వెనక్కు వెళ్ళింది. మళ్లా తనివి తీరా రాధను నెమ్మదిగా లేవకండా ముద్దాడింది. నిశ్శబ్దంగా బయటికి వెళ్ళిపోయింది. అదే తనకర్తవ్యమన్నట్టు.

అప్పుడే భోజనం పూర్తిచేసుకుని చేయి తుడుచుకుంటూ హాల్లోనికివచ్చిన రంగనాథం ఒక్కసారిగా నిస్తబ్దుడైపొయ్యాడు. "కలయో, వైష్ణవమాయయో, ఇతరసంకల్పార్థమో" అన్నట్టు యీజీచైర్‌లో రత్నంలా మెరుస్తూ నిద్రిస్తున్న రాధ. ఇన్నాళ్లనించీ పిల్లలకోసంతనూ భార్యాపొందిన తహతహలూ, ఆవేదనలూ అన్నీ ఒక్కపారి స్ఫురణకొచ్చినై. క్షణకాలం ముద్దుల మూటగడుతున్న ఆపాపవంక తదేక దృష్టితో చూస్తూ నిల్చుండి పోయాడు. "ఎవరి పిల్ల? ఇక్కడికెలావచ్చింది?" అతనిలో బయలుదేరిన యీ ప్రశ్న జవాబును పొందకనే నిష్క్రా

చింది. ఇంతలో అచ్చటికి వేంచేసిన రజని రంగనాథం యిల్లాలు ఊహించలేని ఆశ్చర్యంతో... "ఎవరి పిల్లండీ యీరత్నం?" అతను చిరునవ్వుతో ..."యేమో, నాకుమాత్రం తెలుసా యేం? నేనూ ఇప్పుడేగా యింట్లోంచి బయటికి వచ్చిందీ."

మరింత ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయింది రజని. అన్నాడు..."అప్పుడే మనకు స్వంతమై పోయినట్టు ఆనందిస్తున్నావ్! ఎవరిపిల్లో తెల్సుకుని యిచ్చేదాం." ఎంతమాత్రం వీల్లేదన్నట్టుగా ఆమె ముఖంలో అయిష్టత స్ఫురించింది. ఆ మరుక్షణం ఆమెముఖం వాడిపోయింది. ఇంతలో రాధ లేచి యేడవటం ప్రారంభించింది. రజని రాధను తన పొత్తిళ్లలోనికి తీసుకుని యిటూఅటూ ఊగిస్తూ, జోకొడుతూ రాధ శరీరాన్ని ముద్దులతో నింపేస్తూ యింట్లోనికిపోయి వేడివేడి ఆవుపాలనూ ఆప్యాయంగాపట్టించి, శ్రద్ధతో, ప్రేమతో, వాత్సల్యంతో లాలించింది. రాధ ఆమె ముఖంలోనికి చూస్తూ ఆ పాలను మింగుతూ తన చిన్ననోటితో "అమ్మ!" అనేటప్పటికి యెన్నాళ్లనించో ఆసిస్తున్న తనకి యీనాడు ఒక్కసారిగా మాతృత్వం శిద్ధించినట్టయింది. కాని తనకీ అదృష్టం, యీ ఆనందం, శాశ్వితమో లేక క్షణికమో, ఆమె ఊహించకపోయింది. రంగనాథం అటూయిటూ పచారుచేస్తూ... "అసలు నీకు చంటి పిల్లల్ని యెలా సముదాయించాలో తెలుసా?" "భావుంది. మీదంతా చిత్రం. నాకన్ని తెలుసుగాని...మీరు బజారువెళ్లి వెంటనే ఓ పాల సీసా కొనుక్కురండి. వెళ్లాలి తొందరగా" అంటూ భర్తను తొందర జేసింది.

ఒక వారం రోజులు గడిచాయి. రంగనాథం రాధ తలితండ్రులకై ఆ గ్రామములోనూ ఆ పరిసర ప్రాంతాల్లోనూ, యీవారం రోజులూ అన్వేషణలు జరిపించాడు. యెవరూరాలేదు. బగవంతుడే తమకీ బిడ్డను ప్రసాదించాడని ఆనందించారా దంపతులు.

రాధ కులాసాగా ఆడుకొంటూది. ప్రభ అని నామకరణం చేసారు. ప్రభను ఒక్కక్షణమేనా విడిచి ఉండలేక పోతోంది రజని. ఒక్కక్షణం ప్రభను చూడకపోతే ఆమెహృదయం తహతహలాడి పోతుంది. చిన్నిచిన్ని చిల్కు గౌనులు, మెత్తటి బూట్సులు, చెవులకు చిన్నిచిన్ని లోలకులు. మెడలో ఒక గొలుసు, ఆడుకోటానికి యెన్నో రకరకాల బొమ్మలు, ఒకటేమిటి ఎన్నో వస్తువులు ప్రభకు కల్పించారు వారి జీవితాశయమే యిప్పుడు ప్రభ.

ప్రభకిప్పుడు అయిదేళ్లు నిండాయి. చక్కగా బళ్లోకిపోయి చదువుకోటం అల్లరనేది యెరక్కుండా ఆడుకోటం సహజంగా అలవడినై. ప్రతిరోజూ ప్రభని ముస్తాబుచేసి బళ్లోకి పంపుతూ రజని వీధి గుమ్మంలో నిల్చుని ప్రభ రోడ్డుమలుపు తిరిగే వరకూ దృష్టిచెదరనీకుండా చూస్తూ ఆతర్వాత యిం


సి. జి. ఆర్.
రింగ్ వరమ్
ఆయింటుమెంట్
సుప్రసిద్ధ పైపూత ఔషధం

ఒక్కపూటతోనే గుణం కనిపిస్తుంది.

తామరున్నచోట రాత్రిపూట బాగా మర్దించి ఉదయాన్నే సబ్బుతో కాని షీకాయి పొడితో గాని కడగవలెను. వెల సీసా 1-కి 0-80.

స్టాకిస్టులు: ఏ. స్వర్ణ & కో.,
313. మింట్‌స్ట్రీట్, జీ. టి., మద్రాసు.

ట్లోనికి వెళ్లేది. మళ్లా స్కూలువిడిచే సమయానికి ప్రభ వస్తోందోలేదో అని మాటిమాటికి బయటికి పోయి చూసేది. ఓక్షణం ఆలిశ్యంగావస్తే అప్యాయంగా వళ్లోకితీసుకు ముద్దుపెట్టుకుని—"యేంతల్లీ! యివాళితత ఆలిశ్యంగావచ్చావ్? పంతులు గారు గాని కొట్టలేదుగద?" అంటూ లాలించేది. ఆయింట్లో ప్రభ కోరికకు అన్యదాలేదు. యేంకోరినాసరే కోరటం తడవుగా సమకూర్చ బడుతోంది.

ఓరోజు ప్రభ స్కూలునించి యింటికి రాగానే తండ్రీ వళ్లోచేరి—"నాన్నారూ! నేనివాళేం...ఊ ...కొత్తపాటం నేర్చుకున్నా...అదేమో మీకు తెలుసా? ఊ...తాబేలు...చెవులపిల్లి... మనింట్లో రోజు పాలుతాగేస్తుందేం...అదికాదు...ఇంకోటి." ప్రభ ముద్దుపల్కులకు మురిసిపోతూ ఉండేవారు. ఆ భార్యాభర్తలు యేనాటి అదృష్టమో తమకీప్రభ?

ప్రభ స్కూలుజీవితంలో జర్గిన ఇంకో విశేషం, ప్రభ స్కూలునించి బయటికి వచ్చేటప్పటి రోడ్డుపయిన దుమ్ములో తారాడే ఉన్మాదిని, చిరిగిపోయిన చీర, క్షీణించి పోయిన శరీరం, జడలు కట్టుకుపోయినజట్టూ, నవ్వుకుంటూ, పాడుకుంటూ, యేమేమోతనలో తను గొణుక్కుంటూ, ప్రభను చూడగానే—"అమ్మా," అంటూ దగ్గరకువచ్చి—"అమ్మా! రాధా, నువునారాధవుకావూ? నారాధలేయేదీ...ఆ పుస్తకాలు బరువుగాలేవూ... నేను తెచ్చిపెడతా, ఇటుతే..." అంటూ ప్రభ చేతిలోని పుస్తకాలనూ పలకనూ తనుపుచ్చుకుని, ప్రభ చేయి పట్టుకుని, యింటివరకూ తీసుకవచ్చి అక్కడ ఇచ్చేసి వెళ్లిపోయేది. ప్రతిరోజూ యిది జరుగుతూ ఉండేది. ప్రభ చిన్నిహృదయం యీసంభందం యేమిటో గుర్తించలేక పొయ్యింది. ఒకటి రెండుసార్లు రజని చూసింది. కాని వీధులవెంట తిరిగే పిచ్చిదానికి ప్రభ యందూ యీప్రేమ యేమిటో యీమెకు అవగాహన కాలేదు.

ప్రభ కిప్పుడు వివాహోచితయసు ప్రాప్తించింది. మెట్రిక్యులేషన్ పూర్తిగాగానే చదువు మానేసింది. యింటివద్దనే కూర్చుని తండ్రితోపాటు పత్రికలు, ప్రఖ్యాత రచయితల రచనలు, చదువుకోవటంలోనూ, తన వీణావాయిద్యంతో మేళవించిన తనకిన్నెర కంఠంతో తలిదండ్రుల కాహ్లాదం కలిగించంలోనూ, అమ్మకు యింటిపనుల్లో సాయపట్టంలోనూ, ప్రభ గడుపుతోంది. తగినవరునికై రంగనాథం అన్వేషిస్తున్నాడు.

ఓనాడు ప్రభ తండ్రితోపాటు తమ గుఱ్ఱపు బండిలో విహారానికి వెళ్లింది. ఊరి వెలపల రోడ్డు పయిన ఒచోట జనమూగి ఉన్నారు. ప్రభ బండిని ఆపుచేయించింది. వీధులలో తిరిగే ఉన్మాదిని కారు క్రింద పడిందన్నారు. ప్రభ బండిదిగింది ఆగుంపులో ప్రవేశించింది. ఆ వెనుకనే రంగనాథం వెళ్లాడు. కొన ఊపిరితో ఉన్న ఉన్మాదిని శరీరంపై వ్రాలింది ప్రభ. ప్రభను చూడగనే ఆమె క్షీణించిన స్వరంతో—"అమ్మా! నారాధ, వచ్చావ్ తల్లీ..." ప్రభనుదుటను ఆయాసంతో ముద్దుపెట్టుకుని శాశ్వతంగా కళ్లనుమూసుకుంది. ప్రభ కళ్లెంబడి నీళ్లు జలజల రాలాయి. ఆమెహృదయం దేనికో తహతహలాడిపోయింది. యే ప్రేమసంభందమో ఆమెని ఊహించలేని దుఃఖంలో ముంచేసింది. క్షణకాలం ఆమృత శరీరాన్ని కావలించుకు యేడ్చింది. తన పుస్తకాలను స్కూలునించి యింటివరకూ ఆమె తీసుక వచ్చిననాటి దృశ్యాలు ఆమె మనోవీధిలో ప్రత్యక్షమయ్యాయి. యీదృశ్యాన్ని చూచి లోకం యేమేమో అనుకుంది. కాని యదార్థం యెవ్వరికీ తెలియదు.

కథాంజలి
అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0